క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమామణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

సత్కారం


జార్జి ఎన్విజర్‌ను సత్కరిస్తున్న ఆరికతోట గ్రామ పెద్దలు

రామభద్రపురం: సీబీసీఎన్‌సీ (కన్వెన్షన్ బిపిటిస్ట్ చర్చ్‌స్ నార్తర్న్ సిర్కార్స్) రాష్ట్ర ప్రెసిడెంట్‌గా మండలంలోని ఆరికతోటకు చెందిన విశ్రాంత్ ఎంఈఓ జార్జి ఎన్విజర్ ఎంపికయ్యారు. దీంతో గ్రామపెద్దలు ఆయన్ను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెంకి శేఖర్‌బాబు, పెంకి సుధాకర్, కిల్లాడ గడ్డిరాజు, కిల్లాడ రామకృష్ణ, కిల్లా పండు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, తదితరులు

రాజాం: మండలంలో పొగిరి గ్రామంలో సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ లెనిన్‌లు ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఆరోగ్యశ్రీ లబ్ధిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఈ మేరకు లబ్ధిదారులందరికీ ప్రభుత్వం కొత్త కార్డులను పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు నాటుకోళ్ల యూనిట్లు


కొట్టిశలో మహిళలకు నాటుకోళ్లు అందిస్తున్న వీఓఏ

వంగర: మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు గ్రామైక్య సంఘాల ద్వారా నాటుకోళ్ల యూనిట్లు పంపిణీ చేస్తున్నారు. లక్ష్మీపేటలో నాటుకోళ్ల పెంపకం చేస్తున్నారు. ఇక్కడ నుంచి అన్ని గ్రామాల్లోని మహిళా సంఘాలకు వీటిని అందజేస్తున్నారు. ఒక్కో యూనిట్ ధర రూ.2,600 చెల్లించాల్సి ఉంటుంది. ఒక యూనిట్‌కు పది నాటుకోళ్లు ఉంటాయని, వీఓఏల ద్వారా వీటిని సరఫరా చేస్తున్నట్లు ఏపీఎం మీసాల చక్రపాణి, సీసీలు తెలిపారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

బొబ్బిలి: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీలను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘ బొబ్బిలి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు జె.విక్టర్, చుక్క శ్రీనివాసరావు ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నారాయణరావు, ఉమాదేవి, కృపాల్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యానికి స్పందన


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీ యోగా విద్యాసంస్థలో ఆదివారం నిర్వహించిన ఆక్యుపంక్చర్ నేచురోపతి వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. విశాఖ నుంచి వచ్చిన కె. శ్రీధర్, సి. శ్రావణి, సౌజన్య, బొబ్బిలి శ్రీయోగా విద్యాలయ నిర్వాహకులు ఎంఈవీ ప్రసాద్, కె. సత్య, తదితరులు వైద్యసేవలందించారు. వైద్య శిబిరంలో సుమారు వంద మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

● సర్కార్ బడుల సొగసు చూడతరమా..


సుందరంగా తీర్చిదిద్దిన సతివాడ ప్రాథమిక పాఠశాల


విద్యార్థులు నడిచేందుకు ఏర్పాటు చేసిన కాలిబాట


ఆకర్షణీయంగా ఉన్న సతివాడ పాఠశాల ఆవరణ


ఆధునిక సదుపాయాలతో నిర్మించిన మరుగుదొడ్లు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా, కనీసం చూడడానికి కూడా అసహ్యకర పరిస్థితుల్లో ఉండేవి. కనీస వసతులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడేవారు. అటువంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 'మనబడి నాడు–నేడు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు సర్వాంగ సుందరంగా మారాయి. కార్పొరేట్ స్థాయి వసతులతో పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ఇంగ్లిష్ మీడియం అమలు, పుస్తకాలు, షూస్, బెల్టులు పంపిణీ చేయడంతో పాటు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారు. అలాగే అదనపు భవనాలు నిర్మించి, విద్యార్థులకు ఉపయోగపడేలా ట్యాబ్‌లు సైతం పంపిణీ చేశారు. దీంతో సర్కారు బడులు కార్పొరేట్ పాఠశాలలకు పోటీగా నిలుస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా తెర్లాం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను చెప్పుకోవచ్చు. – తెర్లాం.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం..

● భీమిలి సభ సూపర్ సక్సెస్
● ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసిన ఎమ్మెల్యే శంబంగి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రానున్న ఎన్నికలలో బొబ్బిలిలోని వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్టణం జిల్లా భీమిలిలో శనివారం నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన దిశా నిర్దేశంతో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల్లో ఫుల్ జోష్ వచ్చిందన్నారు. సభకు లక్షలాది మంది రావడంతో ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టిందన్నారు. ప్రజా స్పందన చూస్తుంటే 175 స్థానాల్లో గెలవడం ఖాయమని జోష్యం చెప్పారు. పేద కుటుంబాల భవిష్యత్ బాగుండాలన్నా..అక్క చెల్లెమ్మల సాధికారత కొనసాగాలన్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. దేశ చరిత్రలో ఏ పార్టీ, ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేశారన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి వారి కార్యకర్తలకే సంక్షేమ పథకాలు కట్టబెట్టారని ఆరోపించారు. జగనన్న హయాంలో రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారని తెలిపారు. పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు రైతు రుణమాఫీ, అక్కాచెల్లెమ్మల డ్వాక్రా రుణమాఫీలు చేయకుండా నట్టేట ముంచారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పికొండ లక్ష్మునాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, జెడ్పీటీసీ ప్రతినిధి అప్పికొండ నిర్మల, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షకు 235 మంది హాజరు


పరీక్ష రాస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ 'ఎ' సర్టిఫికెట్ పరీక్షకు 235 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎన్‌సీసీ ఆఫీసర్ బీవీ అచ్యుత్‌కుమార్ తెలిపారు. రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సన్ స్కూల్, డీఏవీ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు), శ్రీకాకుళం జిల్లా పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలురు), కొల్లివలసలోని ఏపీ ఎస్‌డబ్ల్యూ పాఠశాల, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారని అన్నారు. వారికి రాతపరీక్షతో పాటు డ్రిల్ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్ష ప్రొసీడింగ్ ఆఫీసర్ కెప్టెన్ ఎస్.వెంకటరావు, జేసీఓలు దల్‌బీర్ సింగ్, బి.శ్రీనివాసరావు, ఏఎన్‌ఓలు బీవీ అచ్యుత్‌కుమార్, డి.ఉదయ్, పి.పుష్పలత, కె.హరి సమక్షంలో ఈ పరీక్షలు జరిగాయి.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



వివరాలు వెల్లడిస్తున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుప్పిలి భానుమూర్తి

రేగిడి: ఏపీటీఎఫ్ రేగిడి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వావిలపల్లి తారకేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శెట్టి శివరాం, గౌరవ అధ్యక్షులుగా ఎస్.అప్పారావు, ఉపాధ్యక్షులుగా మారుతీ ప్రకాష్, పాలవలస రమేష్, దుప్పాడ త్రివేణి, కార్యదర్శులుగా కుప్పిలి రమేష్, బోర నారాయణరావు, పుర్లి మురళి, కంబాల ప్రసాదరావు, మజ్జి ఉపేంద్రరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వై.విజయ్‌మోహన్, బొప్పాది రాజశేఖర్, కెంబూరు అనంతరావు తదితరులు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుప్పిలి భానుమూర్తి, జిల్లా కార్యదర్శి మురపాక వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించినట్లు అధ్యక్షులు తారకేశ్వరరావు వెల్లడించారు.

పుస్తక పఠనంతో ఎంతో మేలు

● లైబ్రేరియన్ కృష్ణమూర్తి


తెర్లాం: గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి


బాడంగి: గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

తెర్లాం: ప్రతిరోజూ పుస్తక పఠనం చేయడం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తకాలు ఎక్కువగా చదవడం ద్వారా మంచి విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలు, జనరల్ నాలెడ్జ్, పోటీ పరీక్షల పుస్తకాలు, వార్తాపత్రికలను ప్రతిరోజూ చదవాలన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం..

బాడంగి: మండల కేంద్రంలోని చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్ విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. సెలవు రోజుల్లో గ్రంథాలయాన్ని వినియోగించుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు.

ఆధ్యాత్మిక గురువుకు సత్కారం


దామోదరరావు దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

రేగిడి: మండలంలో దేవుదళ గ్రామంలోని గీతాశ్రమ పీఠాధిపతి గొర్ల దామోదరరావు దంపతులను గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామంలో ఆశ్రమం నెలకొల్పి తొమ్మిది సంవత్సరాలు పూర్తికావడంతో పాటు ప్రతీ వారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక భావాల వ్యాప్తికి కృషిచేస్తున్నందుకు సన్మానించినట్లు చెప్పారు. ఆధ్యాత్మిక వక్తలు ఎస్‌వీ రమణ, ఎస్.దామోదరరావు, శ్రవణానందస్వామిజీ, కోత ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యసాయి సందేశాలు ఆచరణీయం

● ఎమ్మెల్యే శంబంగి


మహన్యాస రుద్రాభిషేక పూజల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సందేశాలు ఆచరణీయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక వెలమ కమ్యూనిటీ భవనంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నమామి సాయి శత రుద్రీయం పేరిట 68వ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక ఉత్సవాలు నిర్వహించారు. డాక్టర్ కొరారు సాయి శ్రీహరి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సత్యసాయి భక్తులు, జిల్లా కేంద్ర భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

● ఆర్డీఓ శాంతకుమారి


మున్సిపల్ కార్యాలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ శాంతకుమారి

రాజాం సిటీ: పట్టణంలోని పేదలకు కేటాయించిన ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతకుమారి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పట్టణంలో పెండింగ్ పనుల వివరాలపై ఆరా తీశారు. పేదల ఇళ్ల పంపిణీకి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కులగణన సర్వే సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఎంవీ నాగరాజు, ఏఈ భాగ్యలక్ష్మి, ఆర్ఐ శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

చురుగ్గా కులగణన


వంగరలో కులగణన చేస్తున్న కార్యదర్శి రామారావు


రాజాం: పొగిరిలో కులగణన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వంగర, రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే చురుగ్గా జరుగుతోంది. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సంయుక్తంగా ఈ సర్వే చేపడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సర్వేను పర్యవేక్షిస్తున్నారు. వంగరలో కార్యదర్శి సవలాపురపు రామారావు ఆధ్వర్యంలో ఆదివారం కులగణన చేపట్టారు. రాజాం మండలం పొగిరి, శ్యాంపురం, బొద్దాం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన కులగణన సర్వేను ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు పరిశీలించారు.

టీడీపీలో చేరికలు అవాస్తవం

● వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన 13మంది వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలో చేరారని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నాయకురాలు గుమ్మడి సంధ్యారాణి ప్రకటించడం హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రాయిపల్లి రామారావు అన్నారు. పిట్టాడ గ్రామంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీలో ఉన్నవారికే కండువాలు వేసి వారంతా వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చారని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పిట్టాడ వంతెన, గుర్లతమ్మిరాజుపేట వంతెన, ఆంధ్ర వంతెన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తయిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి మండల వ్యాప్తంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నామని, అలాగే గ్రామాల్లో రహదారులు, నూతన ఆస్పత్రి భవనాలు నిర్మించామని తెలిపారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా, టీడీపీ నాయకులకు కనిపించకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రాజన్నదొరను విమర్శించే అర్హత సంధ్యారాణికి లేదన్నారు.

సంగివలస సభ విజయవంతం: ఎంపీపీ నాయుడు

విశాఖ జిల్లా భీమిలి మండలం సంగివలసలో శనివారం జరిగిన ఎన్నికల శంఖారావం సభ విజయవంతమైందని ఎంపీపీ నాయుడు అన్నారు. సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లెంక రత్నాకర్, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, కనిమెరక త్రినాథరావు పల్లి అప్పలనాయుడు, పున్నాన అప్పలనాయుడు, సతీష్, గండ్రేటి జగదీష్, తదితరులు పాల్గొన్నారు

ఆయుర్వేదంతో ఉపశమనం

రేగిడి: ఆయుర్వేద మందుల వినియోగంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి సునిల్‌కుమార్ సూచించారు. మండలంలో కొమెర గ్రామంలో ఆదివారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.

కార్యక్రమంలో సర్పంచ్ పాడి లక్షున్నాయుడు, హెచ్ఎం శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, శైలజ, ఏఎన్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రేగిడి: మండలంలోని నాయరాళ్లవలస, బూరాడ, తాటిపాడు, లచ్చన్నవలస తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకడంతో పంట పాడవుతోంది. ఏఓ జి.మురళీకృష్ణ, ఏఈఓ లీలామోహన్ ఆదివారం నాయరాళ్లవలస గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. బెంజోయేట్ 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అందులోనే ఒక లీటరు వేపనూనె కూడా వేసి ఆకు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేస్తే కత్తెర పురుగును నివారించవచ్చన్నారు.

● పార్క్‌గా ఎర్రవాని చెరువు..


ఎర్రవాని చెరువు


వాకింగ్ ట్రాక్ నిర్మాణం

పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద ఉన్న ఎర్రవాని చెరువు అందమైన పార్కుగా రూపుదిద్దుకుంటోంది. వుడా ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నిధులు రూ.1.03 కోట్లతో ఈ చెరువును పార్కుగా అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ ఏఈ పి.వెంకట్ తెలిపారు. ఈ మేరకు చెరువులో వ్యర్థాలతో పాటు ఆక్రమణలను అధికారులు తొలగించారు. చెరువు చుట్టూ కంచె, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపడుతున్నారు. –రాజాం


పార్కు చుట్టూ వేసిన కంచె